చిన్న కథ

# తెలంగాణా అమర వీరుని రక్తాంజలి!

★ శ్రీ దాశరథి ★

రక్తం కారుతున్న పశ్చిమాకాశం కిటికీలోనుంచి భయంకరంగా కనిపిస్తున్నది. తన దవడల్లో నించి కారుతున్న రక్తాన్ని చేతితో తుడుచుకున్నాడు విశ్వం. రెండో చేతితో తుడుచుకున్నాడు. రెండు అరచేతులూ దగ్గరగా పెట్టిచూచుకున్నాడు. దవడల్లోనించి నెత్తురు చుక్కలు రాలాయి. దోసిట్లో నెత్తురుగుడ్డలనిండా నెత్తురు. కిటికీలో నెత్తురు. ఎక్కడో లోపలనుంచి వస్తోంది రక్తం – పర్వత గర్భం నుంచి వచ్చే నదిమాదిరి.

వెనక్కు తిరిగిచూచాడువిశ్వం. చీకటిగది (dark cell) తలుపు మూసేసి వెళ్ళిపోతున్నాడు. కాపలా జవాన్. ఆ చిన్నిపాటి కిటికీలో పశ్చిమాకాశపు నెత్తుటి వెలుర్లు ఎంతోసేపు ఆగలేక పోయినై. చీకటి చొచ్చుకో వచ్చింది.

నెలరోజులు కస్టడీలో నానా హింసలూపెట్టి, రహస్య స్థావరాల భోగట్టా సేకరించ శక్యంకాక విశ్వాన్ని సెంట్రల్ జైలుకు పంపివేశాడు. డి. యస్. పి. ప్రతిరోజూ సాయంత్రం ఆకాశం దవడల్లో నెత్తురు, తన దవడల్లో నెత్తురు. ఇవాళ తుదిరోజు తుదిపాటు కసి తీరాకొట్టి జైలుకు పంపించేశారు. ఇహ రేపటినుంచి రక్తం కనిపించదు.

హాహాహాహా! హాహాహా! చీకట్లో తనకు తానే నవ్వుకున్నాడు. దవడల్లో

నుంచి వచ్చే నెత్తురు కనిపించకండా చీకటి అడ్డంవచ్చింది.

ఏకాంతంలో, నిశ్శబ్దంలో, చీకటిలో కళ్లుమూసుకున్నాడు విశ్వం. చీకట్లో మళ్ళీ నవ్వాడు. పోలీసు బలగం తనముందు వోడిపోయింది. తన వొంటిలోనించి జారిపోయిన ప్రతి రక్తం చుక్కా గెలిచింది. విరిగిన ప్రతి కీలూ గెలిచింది. గెరిల్లాల రహస్య స్థావరం సురక్షితంగా వుండిపోయింది. హహహహ్హా.

ఎన్నడూ లేనంత లోతుగా నిద్రపోయాడు విశ్వం. సూర్యగోళాన్ని తనవైపు లాక్కుంటున్నాడు. సూర్యునిచుట్టూ తిరిగే గోళాలన్నీ తనచుట్టు ప్రదక్షిణం చేస్తున్నె. బ్రహ్మాండపు లా అండ్ ఆర్డర్ పటీ కొట్టింది. ఇంక్విలాబ్! జిందాబాద్...!

చర్చిలూ, ట్రూమనూ ఆటం బాంబులతో నైజాం యింట్లో విందారగిస్తున్నారు. నల్లగొండ పల్లెటూళ్ళల్లో తల్లీ పిల్లా ఆకలి మంటల్లో 'ఇంక్విలాబ్' మంత్రం జపిస్తున్నారు.

నైజాం రాక్షసినోట్లో నరనరంలో తిరుగుబాటు, రోమరోమంలో విప్లవం కదులుతున్నది. జ్వరం! నైజాం రాజుకు జ్వరం! సన్నిపాతం, ఉన్మాదం, స్వతంత్ర హైద్రాబాద్!

డొక్క వెన్నంటిన పేదరైతు కళ్ళల్లో మిరుగుళ్ళను వూది వూది మంటచేసి కాగడా వెలిగించి కింకోటి శిఖరానికి నిప్పు ముట్టిస్తున్నాడు విశ్వం. నైజాం నరాల్లో చొరబడి రక్తాణువులకు తిరుగుబాటు బోధిస్తున్నాడు. నరాల నెప్పుల్ని సర్దుకోడానికి కత్తితో కండల్ని కోసుకుంటున్నాడు నైజాం. తెగిపోయిన కండరాలు నవ్వుతున్నాయి. హహహహహ్హా.

నరాల్లో విశ్వం, విశ్వం వెంట విశ్వం.

చీకటిగదిలోకి వెలుతుర్లు తొంగితొంగి చూస్తున్నాయి. విశ్వం ఆవులించి లేచాడు. ఎండిపోయిన నెత్తురు చారల్ని తడుముకున్నాడు.

"బ్యారక్కులోకి పదండి" అన్నాడు కాపలా జవాను. విశ్వం చరచరా అతనివెంట నడిచాడు.

వీళ్ళంతా యెవరు ?! వందలమంది బందీలు, క వు లు, గాయకులు, విద్యార్థులు, రైతులు, కూలీలు, జమీందార్లు, షావుకార్లు, స్త్రీలు, వీళ్ళే దేశం. దేశమంతా రాజద్రోహులే ? దేశాన్ని జైల్లో కట్టేశాడు నైజాం. ఈ జైళ్ళు పికిలి పోతే. ఆ గోడలు వీళ్ళను అడ్డలేవు. ఈ పో లీ సు ల కాపలా ఆగదు.

"మేం యే డు వం ద లున్నాం, భయపడకేం !"

"అతని చేయి విరుచుకుంది నైజాంరాక్షసి"

"ఇతనికాలు నమిలేసింది."

"వీడి డొక్కలో ఏడుమాట్లు కాల్చారు."

"ఇతని భుజం యెగిరిపోయింది.

"నీ దవడకు దెబ్బతగిలిందా?"

విశ్వం నిర్ఘాంతపోయాడు. తన దగ్గిరనించి చాలా క్రొద్దిరక్తాన్నే తాగాడు నైజాం. వీళ్ళంతా బిందెలతో తాగించారు ర క్తం. అమితంగా తాగి తం ద నా లా డు తున్నాడు నైజాం. తల తిరుగుతోంది. ఇహా క క్కేస్తాడు, పడిపోతాడు. ఈ ర క్తం జీర్ణంకాదు. ఇమడదు.

విశ్వం జైలుసాంతం గబగబా తిరిగి చూచాడు. ఏడువందల మందికి వొకేవక నీ ళ్ళ పం పు. ఇందరూ స్నానంచేయాలి, గుడ్డలు వుతుక్కోవాలి. తాగాలి. అన్నిటికీ సరిపుచ్చుకోవాలి! కొండ దోమ కరిచిందా జ్వరం తప్పదు. నిజామాబాదు జైలు అచ్చంగా నరకం. నీళ్ళనిండా ప చ్చ గా పాకుడు, క్రిములు. నీళ్లులాగేమర వారానికి రెండుసార్లు చెడుతుంది ఆ రోజల్లా దప్పితో, ఆకలితో యేకాదశిగడపాలి. రెండు జొన్న రొట్టెలు ఆహారం. వా టి ల్లో సున్నం, మన్ను, గడ్డి, ఇసుక. లోపల వుడకదు రొట్టె. పైన మాత్రం మాడుతుంది. ప ప్పు పులుసులోదుర్వాసన, పురుగులు, చెత్త. ఈ రె ం డు రొట్టెలు, గ ం టె డు పులుసుతో విట మిన్లన్నీ లభించాలి ?

డిసెంట్రీ, మలేరియా, డయేరియా! మందులు ఇండియా ప్రభుత్వం ఆపిందట. మ్యాగ్ సల్ఫ

సైతం లేదు. మండిపోతున్న ఎండ కాలంలో మజ్జిగేది? ల్యాట్రిన్‌ల నిండా రక్తం మడుగులు. దుర్గంధ్యం చనిపోయాడు డిసెంబ్రులో పాపం! పెళ్ళాం పిల్లలు జైలుగేటుముందు రెండు రాత్రులు ఏడిచారు. శవం సైతం దొరకలేదు వాళ్ళకి.

బాధలకు భయపడకండి. గుండె బండ చేసుకోవాలి. ధైర్యం తెచ్చుకోవాలి. చావు చాలా చవక. బ్రతుకు బ్లాక్‌మార్కెటు ధర. మనశ్శాంతికి, ఉత్సాహానికి 'వందేమాతరం' పాడుకుందాం.

"వందేమాతరం పాడావా చంపేస్తాం"

"నీకేం! మేం పాడుకుంటే?"

"హిందూ ప్రార్థన మేం వినం"

"ఇందులో హిందూ సమస్యే లేదు."

"కాంగ్రెస్ కమ్యూనిస్ట్ అంతా హిందూలే"

"ఇదే మతోన్మాదం"

"ఖామూష్..."

"అసలు నీవీ బ్యారకుల్లో యెందుకు ?"

"ఇందులోనే వుంటా"

"అయితే మేం పాడుకుంటాం"

"ఏదీ పాడు, చూస్తా"

"వందే..." ఫెళ్ళుమంది విశ్వం దవడమీద బలంగా కొట్టాడు ముస్లిం క్రిమినల్. మళ్ళీ సాగింది ఆగి పోయినరక్తం అరచేతితో తుడుచు కున్నాడు విశ్వం. క్రిమినల్ కళ్ళు యెర్రగా వున్నాయి. బాగా తాగాడు. జైల్లో సారాయి? జైలు అధికార్లే తాగించారు. ఏదో కుట్ర

"ఇంక్విలాబ్ జిందాబాద్ !" విశ్వం గర్జించాడు. విశ్వం దవడ మళ్ళీ కొట్టాడు క్రిమినల్. వెనక నుంచి క్రిమినల్ గూబ బద్దలైంది.

"హిందూలు నన్ను చంపుతు న్నారు, రాండి ! రాండి !"అని గట్టిగా అరిచాడు క్రిమినల్.

"మేం సహాయంచేస్తాం" లాఠీ లతో, ఇనపసీకులతో ముస్లిం గుండాలు జైల్లోకి ప్రవేశించారు నిరాటంకంగా జైలుగేట్లనీ తెరు చుకున్నై. బారకుల తలుపుల తాళాలు పడిపడినై.

"పోలీస్ ! పోలీస్"అని పిలుస్తూ బ్యారకుల అవతలకి పరిగెత్తాడు

విశ్వం. ఫట్ విరుచుకోపడ్డాడు విశ్వం. తలమీదలాఠీదెబ్బపడింది.

గూండాలు ఇనపసీకులతో, కర్రలతో బంధితుల్ని కొడుతున్నారు.

"వందేమాతరం——"

"అల్లాహెూ అక్బర్"

"ఇంక్విలాబ్ ——"

"సారే తక్‌బీర్"

కల్లోలం, కోలాహలం. నిరాయుధుల్ని, నిర్బంధితుల్ని, నిరపరాధుల్ని కొడుతున్నారు. పడిపోయిన విశ్వాన్ని తొక్కుతూ గూండాలు పరుగెత్తి వస్తున్నారు. అరచేతితో తలమీది గాయం అదుముకున్నాడు విశ్వం. లేచినుంచున్నాడు. ఘోరం జరుగుతున్నది. అనేకులు నేలకు వొరుగుతున్నారు.

"ఎదిరించి చావండి. ఇంక్విలాబ్ జిందాబాద్ !" గర్జించాడు విశ్వం. గూండాల లాఠీలు రక్తం తాగుతున్నై. విశ్వం వొకగూండా నడుంమీద దూకాడు. వాడి లాఠీ గుంజుకున్నాడు. విసరడం ప్రారంభించాడు

"లాఠీలు గుంజుకుని ఎదురుదెబ్బ తీయండి" అరిచాడు విశ్వం. పళ్లాలు, గ్లాసులు విసురుతున్నారు బందీలు. వాటి తాకిడికే గూండాల బుర్రలు గింగురుమంటున్నై. విశ్వం లాఠీదెబ్బలకు ముగ్గురు పడుకున్నారు గూండాలు. మళ్ళీ ఆరుగురు గూండాలు విశ్వాన్ని చుట్టేశారు. ఇనపసీకుల దాడికి విశ్వం లాఠీ ఎగిరిపోయింది. ఫెట్! విశ్వం తలమీద ఇనపసీకు దెబ్బపడ్డది. కూలిపోయాడు విశ్వం. పిడుగుపడ్డటయింది. పడిపోయినవాణ్ణికసితీరా కొట్టి పారిపోయారు గూండాలు.

"దప్పి, దప్పి, ఇంక్విలాబ్ !" అంటున్నాడు విశ్వం. నీళ్లు లేవు. బ్యారక్కునిండా రక్తం పరుచుకుంది. విశ్వం రక్తంలో దొర్లుతున్నాడు.

"గూండారాజ్ ముర్దాబాద్" యేదువందలమంది యేకకంఠంగా అరిచారు. "ఇంక్విలాబ్ జిందాబాద్". విశ్వం నెత్తురులో దొర్లుతున్నాడు. దప్పి, దప్పి, నీళ్ళు లేవు, మందు లేదు.

"హా హా హా హా" పెద్దగా నవ్వాడు విశ్వం.

బ్యారక్‌లో రాజకీయ ఖైదీలు నలుగురు విశ్వం చుట్టు మూగారు.

చీకటి !

"నవ్వుతావేం విశ్వం ?"

"నైజాం వోడి పోయాడు"

"డెలెమా కమ్ముకుంటున్నది విశాఖపైకి"

"దోసిట్లో నెత్తురునింపుకోండి"

"విశ్వం !"

"హాహాహాహా"

"అట్లా నవ్వుతావేం ?"

"మనం గెలిచాం..."

ఆకాశం నోరు తెరిచింది. నోటి నిండా నెత్తురు. విశ్వం వొంటి నిండా నెత్తురు రెండువాదలనుంది నిస్సహాయుల రక్తంతో రంగులద్దుకున్న జైలుగోడలమీద సూర్య కిరణాలు మెరుస్తున్నాయి. నిరాయుధుల్ని హింసించిన గూండాల రాజభక్తికి ధైర్యసాహసాలకు ఆనందిస్తున్నాడు నైజాం కింగ్ కోటలో. భవిష్యత్తు దొంగ చాటుగా తొంగి తొంగి చూస్తున్నది నైజామును మింగాలని.

నెత్తుగు అంటిన రెండు అర చేతుల్నీ దగ్గరగా చేర్చుకుని పడి వున్నాడు విశ్వం. విశ్వం దోసిట్లో కన్నీళ్ళు కార్చారు మిత్రులు.

నవ్వుతున్నాదు విశ్వం ఆకాశంలో సూర్యగోళం అతనిచుట్టూ నృత్యం చేస్తున్నది.

ప్రాగాకాశంలో రక్తాంజలి.

---

# ఎమర్సన్ :

ఎప్పుడైతే సంకెళ్ళు ఒక చివర బానిస ముంజేతిని బంధిస్తాయో, తప్పనిసరిగా రెండోచివర యజమాని చేతికి బిగుసుకుంటాయి.

---